నేడు జాతీయ లోక్ అదాలత్

మెదక్ అర్బన్, డిసెంబర్ 13: నేడు జిల్లా న్యాయస్థానముల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో జిల్లాలోని అన్ని కోర్టుల్లో సివిల్, క్రిమినల్, భార్యాభర్తల కేసులు, కుటుంబ తగాదాలు, మోటార్ వెహికల్ ఆక్సిడెంట్స్, బ్యాంకు, ఫైనాన్స్, చిట్‌ఫండ్ కేసుల్లో ప్రజలు, కక్షిదారులు రాజీ చేసుకునే అవకాశం ఉన్నదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెదక్ రూరల్, డిసెంబర్ 13: మండలంలోని పాతూరు, మక్తాభూపతిపూర్, రాజ్‌పల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్ కో ఏడీఈ మోహన్‌బాబు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, వివిధ కారణంగా మెదక్, హవేళీఘన్‌పూర్ మండలాల్లోని శమ్నాపూర్, గంగాపూర్, పాతూరు, రాయిన్‌పల్లి, మక్తభూపతిపూర్, శివాయిపల్లి, మాల్కాపూర్, గుట్టకిందిపూర్, వెంకటపూర్, ఖాజీపల్లి, కొంటూరు, రాజ్‌పల్లి, బాలనగర్, తిమ్మక్కపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 10 నుంచి మాధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

విద్యార్థులు ఇష్టంగా చదువుకోవాలి

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న టీచర్లు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 13: విద్యార్థులు ఇష్టంగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామానికి పేరు తేవాలని హెచ్ఎం నాగసుజాత సూచించారు. శుక్రవారం జంగరాయి ప్రాథమికోన్నత పాఠశాలలో నోబ్యాగ్ డే సందర్భంగా వివిధ విభాగాల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూరారం, దర్పల్లి జడ్పీహెచ్ఎస్‌ల హెచ్ఎంలు సాయిరెడ్డి, శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు స్వెట్టర్లు, దుప్పట్ల పంపిణీ

టేక్మాల్, డిసెంబర్ 13: మండలంలోని ధనూర గ్రామంలో విక్టరీ వెంకటేశ్ ఫాన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజా యూత్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంపల్లి రాజు ఆధ్వర్యంలో శుక్రవారం 50 మందికి ఎస్సై రాజేశ్ ద్వారా దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

చిన్నశంకరంపేట, డిసెంబర్13: దర్పల్లి గ్రామంలో విష్ణుదాసుకు రూ.60 వేలు, ఉప్పరి రాజుకు రూ.17 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం అందజేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

చిలిపిచెడ్, డిసెంబర్ 13: అన్ని పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో విఠల్ తెలిపారు. శుక్రవారం చిట్కుల్‌లోని కేజీబీవీని పరిశీలించారు. వంట స్థలం వద్ద పరిశుభ్రత పాటించాలని సూచించారు.

ఆదర్శ పాఠశాలలో హిందీ పండిట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

చేగుంట, డిసెంబర్13: చేగుంటలోని ఆదర్శ పాఠశాలలో హిందీ పండిట్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌పీటీ ఉండి టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 17న డెమో క్లాస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు చేగుంట ఆదర్శ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రికొడుకుకు గాయాలు

రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు

చేగుంట, డిసెంబర్13: రోడ్డు ప్రమాదంలో తండ్రికొడుకులకు గాయాలైన ఘటన చేగుంట మండలంలోని చిన్నశివునూర్ శివారులోని జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకున్నది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్ మండలం పేర్కిట్ గ్రామానికి చెందిన మొరే సాయికుమార్, ఆశోక్ తండ్రీకొడుకులు. ఇద్దరు హైదరాబాద్‌కు కారులో వెళ్తున్నారు. చిన్నశివునూర్ శివారులోని సురాన పరిశ్రమ జాతీయ రహదారి వద్ద కంటైనర్ వాహనం అజాగ్రత్తగా నడుపుతూ యూటర్న్ చేయడంతో కారు ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో మొరే సాయికుమార్, ఆశోక్ ఇద్దరికీ గాయాలయ్యాయి. దీంతో తండ్రీకొడుకులను మెడ్చల్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. క్షతగాత్రుడు అశోక్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

ఊరంతా విద్యుత్ షాక్

- విద్యుదాఘాతంతో వివాహిత మృతి
- భయాందోళనలో తండా వాసులు

అనిత

నర్సాపూర్,డిసెంబర్13: ఊరంతా విద్యుత్ షాక్ గురై వివాహిత మృతిచెందిన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని ఎర్రకుంటతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బాల్యాతండాలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. తండావాసుల వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లో ఉన్న సామగ్రికి, గోడలకు, ఇతర వస్తువులకు విద్యుత్ సరఫరా జరిగి షాక్ రావడంతో తండావాసులు ఆందోళనకు గురయ్యారు. అదే సమయంలో బాల్యాతండాకు చెందిన హలావత్ అనిత(27) తన కొత్త ఇంటి నిర్మాణ పనులు ముగించుకొని ఇంటికి వచ్చిం ది. ఆమె రాగానే భర్త శ్రీనివాస్ తండాకు చెందిన వ్యక్తి బోరు వేస్తున్నాడని చూడడానికి పొలానికి వెళ్లాడు. అలసటగా ఉన్న అనిత టీ తాగడానికని వంట గదిలోకి వెళ్లింది. వంట

శివ్వంపల్లి: కొంతాన్‌పల్లిలో తెగిన విద్యుత్ తీగలు

గదిలో స్టీల్ వస్తువు తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. భర్త శ్రీనివాస్ బయట నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి భార్య నేలపై మృతిచెంది విగత జీవిగా కనిపించడంతో కన్నీరు పెట్టుకున్నాడు. తండావాసులు అక్కడకు చేరుకుని గదికి విద్యుత్ సరఫరా అయ్యే తీగను తొలిగించారు. అనంతరం తండావాసులు సైతం తమ ఇండ్లలో కూడా విద్యుత్ షాక్ వస్తుందని చెప్పారు. విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వగా ఎవరూ స్పందించలేదని, ఉదయం 10 గంటల వరకు ఏ అధికారి రాలేదని తండావాసులు వాపోయారు. రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటల వరకు గ్రామంలో విద్యుత్ సరఫరా అలానే కొనసాగిందని, ఆ తర్వాత విద్యుత్ సిబ్బంది వచ్చి విద్యుత్‌ను నిలిపివేశారని తండా వాసులు తెలిపారు. తండాలోని ఇండ్లలో విద్యుత్ సరఫరా లేని వైర్ల పైభాగాన్ని టెస్టర్లతో పరిశీలించగా విద్యుత్ సరఫరా జరిగింది. అలాగే గోడలకు, ఇతర సామగ్రికి కూడా విద్యుత్ రావడంతో భయాందోళనకు గురయ్యారు. మృతురాలు అనితకు భర్త శ్రీనివాస్, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

తెగిన విద్యుత్ లైన్.. స్పందించని అధికారులు

శివ్వంపేట, డిసెంబర్ 13: శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామంలో విద్యుత్ లైన్ తెగిపడడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. వారం రోజుల క్రితం విద్యుత్ లైన్ తెగిపోయింది. అధికారులకు సమస్య తెలియజేస్తే ఇగ జేస్తం.. అగ జేస్తం అని పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి తెగిన విద్యుత్ వైర్‌ను సరిచేసి సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే

చిన్నశంకరంపేట: టి.మాందాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చేగుంట: నార్సింగిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే చెపడుతున్న ఈవో నాగభూషణం

- కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట, డిసెంబర్ 13: జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతున్నదని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని టి.మాందాపూర్‌లో సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం లక్షా 90వేల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. సర్వే జనవరి మొదటి వారంలో ముగుస్తుందన్నారు. అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో దామోదర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

చేగుంట, నార్సింగి మండలాల్లో..

చేగుంట, డిసెంబర్ 13: చేగుంట, నార్సింగి మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతున్నది. నార్సింగిలో ఈవో నాగభూషణం, చేగుంట మండలం చందాయిపేటలో పంచాయతీ కార్యదర్శి రాధ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. వారితో రాజేశ్, యాదగిరి యాదవ్, భాగ్యరాజ్, ముజామిల్ తదితరులున్నారు.

చేగుంటలో వ్యక్తి అదృశ్యం

షేక్ ఆసిఫ్

చేగుంట, డిసెంబర్ 13: వ్యక్తి అదృశ్యమైన ఘటన చేగుంటలో చోటుచేసుకున్నది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్ర కారం.. పట్టణానికి చెందిన షేక్‌ఆసిఫ్ హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో రైల్వే ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 3న ఉద్యోగానికి వెళ్లి సాయంత్రం బస్సులో చేగుంటకు వస్తున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో చెప్పాడు. ఇప్పటివరకు రాలేదు. బంధువుల వద్ద, తెలిసిన వారి వద్ద వెతికినా ఆసిఫ్ సమాచారం లభించలేదు. అతడి ఆరోగ్యం సరిగా లేదని, అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుం దని, 10రోజులుగా ఆచూకీ దొరకకపోవడంతో ఆసిఫ్ భార్య షేక్ షిరీన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

రూప్లాతండాలో టీబీ క్యాంపెయిన్

శివ్వంపేట, డిసెంబర్ 13: ప్రభుత్వ ఆదేశాల మేరకు రూప్లాతండాలో టీబీ క్యాంపెయిన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఇందులో 112 మందికి పరీక్షలు చేశారు. అందులో 25 మందికి ఎక్స్‌రే తీయగా 8 మందికి తెమడ పరీక్ష ద్వారా, ఒకరికి పాజిటీవ్‌గా నిర్ధారణ అయినట్లు డాక్టర్లు తెలిపారు. ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ రాజేశ్వరి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన, మండల వైద్యాధికారి సాయిసౌమ్య, ఎంపీహెచ్ ఈవో శ్రీనివాస్, మహేశ్, ఎక్స్‌రే యూనిట్, వైద్య సిబ్బంది ఉన్నారు.

స్కూల్ అసిస్టెంట్‌గా రవికి ఉద్యోగోన్నతి

రేగోడ్, డిసెంబర్ 13: గజవాడ కాంప్లెక్స్ సీఆర్పీగా గత 12 ఏండ్లుగా సేవలందించి స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించిన రవి, గతంలో సీఆర్పీగా సేవలందించారు. వీడ్కోలు సందర్భంగా ఉపాధ్యాయ బృందం సన్మానించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తూప్రాన్, డిసెంబర్ 13: తూప్రాన్ మున్సిపాలిటీ అభివృద్ధితో పాటు తనను గెలిపించిన 13వ వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తూప్రాన్‌లోని 13వ వార్డులో వాటర్ ట్యాంక్ నుంచి బుడ్డ శ్యామల ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

తూప్రాన్, డిసెంబర్ 13: స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు హాజరై, బైక్‌పై తిరిగి వెళ్తున్న యువకుడిని బొలేరో వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేటకు చెందిన ఈసూరి లక్ష్మయ్య చిన్న కుమారుడు ఈసూరి అరుణ్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం రాత్రి తన స్నేహితుడు నర్సగౌని శ్రీనివాస్‌తో కలిసి తూప్రాన్‌లోని మరో స్నేహితుడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట యూటర్న్ తీసుకుంటుండగా నర్సాపూర్ చౌరస్తా వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో అరుణ్ (19) అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి స్నేహితుడు శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని గాంధీ దవాఖానకు తరలించారు. బొలేరో వాహన డ్రైవర్ వెల్దుర్తి మండలం బస్సాపూర్ గ్రామానికి చెందిన బొడ్డు అజయ్‌గా గుర్తించారు. బొలెరోను డ్రైవర్ అజయ్ అజాగ్రత్తగా, అతి వేగంగా నడపడంతోనే తన కుమారుడు మృతి చెందాడని, మృతు డి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

డీడబ్ల్యూవో హైమావతి

దొంతిలో బాలమేళాను తిలకిస్తున్న డీడబ్ల్యూవో హైమావతి

శివ్వంపేట, డిసెంబర్ 13: చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలమేళా ఉపయోగపడుతాయని డీడబ్ల్యూవో హైమావతి తెలిపారు. శుక్రవారం మండలంలోని దొంతి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సంతోష, వసుమతి ఆధ్వర్యంలో బాలమేళాను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు తయారు చేసిన మట్టి పాత్రలు, స్టోరీ థియేటర్, పప్పీ హౌస్‌తో పాటు ప్రకృతి సందర్శనలో సేకరించిన వస్తువులను బాలమేళాలో ప్రదర్శించారు. డీడబ్ల్యూఓ హైమావతి, సీడీపీవో హేమభార్గవి బాలమేళాను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో విద్యా బోధన చేస్తున్నామన్నామరు. పిల్లలు, తల్లులు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చింతల కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, భజరంగీ అంజి, వడ్ల శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, హేమలత, ఫయీమున్నీసా పాల్గొన్నారు.

క్రీడాపోటీలు అట్టహాసంగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

- అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేశ్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులకు సమస్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేశ్ హాజరై జిల్లా స్థాయి క్రీడా పోటీల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 17న ప్రారంభించే జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను ఉద్దేశించి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. క్రీడాకారులకు మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. క్రీడాకారులందరూ ఈ నెల 17న హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు, పీడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, డిసెంబర్ 13: చిలిపిచెడ్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి పంపుతామని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో శరత్‌రెడ్డి, తదితరలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

రామాయంపేట, డిసెంబర్ 13: రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి సీఎం కప్ పోటీలో జిల్లాస్థాయికి విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హిమజ్యోతి తెలిపారు. కళాశాలలో విద్యార్థులను అభినందించారు. మూడు రోజులుగా రామాయంపేటలో జరిగిన ఆటల్లో జిల్లాస్థాయికి ఖోఖోలో బద్రు, చరణ్, మొహిరన్, కబడ్డీ, రన్నింగ్‌లో స్పందన ఎంపికైనట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో విద్యార్థులు మంచి ప్రతిభను చాటి కళాశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.

చిలిపిచెడ్: ఉన్నత పాఠశాలలో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

రామాయంపేట నుంచి జిల్లా స్థాయికి ఎంపికైన కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

బ్యాంకు లావాదేవీలపై అవగాహన

చిన్నశంకరంపేట, డిసెంబర్13: చిన్నశంకరంపేట మోడల్ పాఠశాలలో ఒకేషనల్ చదువుకుంటున్న విద్యార్థులకు బ్యాంకు లావాదేవీలపై శుక్రవారం అవగాహన కల్పించారు. డీసీసీబీలో లావాదేవీలు, పొదుపు, ఏటీఎం కార్డుల వినియోగంపై మేనేజర్ అఖిల్, ఐటీ టీచర్ ప్రమోద్‌రెడ్డి అవగాహన కల్పించారు.

సీసీ కెమెరాలతో పంటలకు రక్షణ

వ్యవసాయ భూమిలో రైతు ఇబ్రహీం ఏర్పాటు చేసుకున్న సోలార్ సీసీ కెమెరా

నిజాంపేట, డిసెంబర్ 13: దుకాణ సముదాయాలు, వాణిజ్య సంస్థల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ఇందుకుభిన్నంగా నిజాంపేటకు చెందిన రైతు మహమ్మద్ ఇబ్రహీం తన పొలం వద్ద పంటల భద్రత కోసం సోలార్‌తో పని చేసే రెండు సీసీ కెమెరాలు ఏర్పాటుచేశాడు. సిద్ధిపేట– మెదక్ ప్రధాన రహదారి పక్కనే పొలం ఉంది. పంటలను ధ్వంసం చేసే పక్షులు, జంతువులు, మనుషులను గుర్తించడానికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు రైతు తెలిపాడు.

మహిళా సంఘాలకు కోడిపిల్లల పంపిణీ

శివ్వంపేటలో నాటుకోడిపిల్లలు పంపిణీ చేస్తున్న డీపీఎం ప్రకాశ్

శివ్వంపేట, డిసెంబర్ 13: స్వయం సహాయక సంఘాల మహిళలకు అదనపు ఆదాయంగా కోడిపిల్లలను శుక్రవారం పంపిణీ చేసినట్లు డీపీఎం ప్రకాశ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు అభివృద్ధి చెందడానికి ఐకేపీ ఆధ్వర్యంలో 26 యూనిట్లు మొత్తం 1300 నాటు కోడిపిల్లలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ మహిళల ఆదాయం మరింత వృద్ధి చెందడానికి నాటుకోడి పిల్లలను పంపిణీ చేశామన్నారు. వాటిని సంరక్షించుకుని లాభాలు అర్జించాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, సీసీలు, వీవోఏలు, అకౌంటెంట్, ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు

కుస్తీ పడుతున్న మల్లయోధులు

టేక్మాల్, డిసెంబర్ 13: మండలంలోని కాదులూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి జాతర మూడు రోజులుగా కొనసాగుతున్నది. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల ప్రజలు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. శుక్రవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర పలు ప్రాంతాల నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. కుస్తీ పోటీలో ఫైనల్ విజేతకు వెండి కడియాన్ని, వివిధ దశల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు.

ధర్పల్లి జడ్పీహెచ్ఎస్‌లో మాక్ అసెంబ్లీ

మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 13: దర్పల్లి జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు మాక్ అసెంబ్లీని శుక్రవారం నిర్వహించారు. స్పీకర్‌గా అఖిల, సీఎంగా వైష్ణవి, ఉప ముఖ్యమంత్రిగా సంజన వ్యవహరించారు. హెచ్ఎం శ్రీనివాస్‌రావు, చైర్మన్ సంతోష్, టీచర్లు పాల్గొన్నారు.

భూవివాదంలో ఒకరికి గాయాలు

నర్సాపూర్, డిసెంబర్ 13: భూ వివాదంలో ఘర్షణ జరిగి ఒకరు గాయపడిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుజాల్‌పూర్ గ్రామంలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. శివంపేట్ మండలం కొత్తపేట్ తండాకు చెందిన భిక్షపతి, పురుషోత్తం కొంతకాలంగా భూమిలో చదును చేసుకుంటూ వ్యవసాయం చేస్తున్నారు. శుక్రవారం తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్, లింగం ఆ భూమిని గతంలో తనకు విక్రయించారని వారిని అడ్డుకున్నారు. ఈ విషయంలో ఇరువురి మధ్య వివాదం నెలకొన్నది. మాటామాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో శ్రీనివాస్, లింగంపై కొత్తపేట తండాకు చెందిన భిక్షపతి, పురుషోత్తం కుటుంబీకులు కర్రలు, కత్తులతో దాడి చేశారు. దీంతో శ్రీనివాస్ తలపై తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు దవాఖానకు తరలించారు. మరో వ్యక్తి లింగం స్వల్పంగా గాయపడ్డాడు. ఈ విషయాన్ని క్షతగాత్రుడు లింగం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకురాలు బాలమణి

రామాయంపేట, డిసెంబర్ 13: కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు నిరసన దీక్షలు చేస్తామని సీఐటీయూ జిల్లా నాయకురాలు బాలమణి డిమాండ్ చేశారు. శుక్రవారం పురపాలిక పారిశుధ్య కార్మికులతో కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ప్రభుత్వం కార్మికులపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. కార్మికులకు గ్లౌజులు, షూష్, రెండు జతల బట్టలు, సబ్బులు, నూనె, చెప్పులు ఇవ్వడం లేదని విమర్శించారు.

నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలి

చిన్నశంకరంపేట, డిసెంబర్ 13: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను పీఆర్‌సీ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మడూర్ జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. చేశారు. ఈనెల 17న ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేశ్, శ్రీహరి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338978-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.